క్లుప్తంగా

వాస్తవ పరిస్థితులను మదింపు చేయండి

● డీటీలను ఆదేశించిన జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): భూ రీసర్వే సమయంలో క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను మదింపు చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో పీఓఎల్ఆర్ డీటీలతో రీసర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు రీసర్వేను పూర్తి చేయడం కన్నా రైతుల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మ్యూటేషన్లు, వారసత్వంగా వచ్చే భూములు, విక్రయాల ద్వారా సంక్రమించిన ఆస్తులపై క్షేత్రస్థాయిలో విచారణ చేసి పీఓఎల్ఆర్‌ను చేపట్టాలన్నారు. డ్రోన్ సర్వే పూర్తయిన గ్రామాలకు త్వరలోనే ఫొటో ఇమేజెస్ వస్తాయన్నారు. కార్యక్రమంలో కేఆర్ఆర్‌సీ ఎస్‌డీసీ లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

25న పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని విజ్ఞాన పీఠంలో పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆ విద్యా సంస్థ కరస్పాండెంట్ పి.పి.గురుమూర్తి పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 1974వ సంవత్సరంలో జి.పుల్లారెడ్డి దాతృత్వంతో ఏర్పాటైన విజ్ఞాన పీఠం పాఠశాలలో కొన్ని వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసించారన్నారు. వారందరితో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు పాఠశాల వార్షికోత్సవం కూడా జరుగుతుందన్నారు. విజ్ఞాన పీఠం కార్యాధ్యక్షులు పి.సుబ్బారెడ్డి, జి.పుల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జి.రాఘవరెడ్డి, ట్రస్టీ ఏకాంబర రెడ్డి వీహెచ్‌పీ అఖిల భారత కార్యాకారిణి సభ్యులు వై.రాఘవులు హాజరవుతారన్నారు.

చిరుద్యోగికి జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న గుర్రాల శ్రీనివాసులు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్‌లోని పీఐయూ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూనే ... తాను జన్మించిన సఫాయి కర్మచారి కుటుంబాల సంక్షేమం కోసం ఢిల్లీ స్థాయిలో కృషి చేస్తున్న పంచాయతీ రాజ్ చిరుద్యోగి గుర్రాల శ్రీనివాసులుకు జాతీయ అవార్డు లభించింది. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో విస్‌డమ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 'ఇండియన్ ఐకాన్ నేషనల్ అవార్డు 2023' ను శ్రీనివాసులుకు అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందని, సఫాయి కర్మచారుల తలరాతలను మార్చేందుకు తన శామశక్తుల కృషి చేస్తానన్నారు. రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ అనుమాండ్ల నాగరాజు, టీవీ అశోక్‌కుమార్, సినీ హీరో రాజ్‌కాంత్, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు డా.అనితామోహన్‌దాస్, మంజులాగౌర్, డా.హనుమంతరావు, దాసి శివదేవ్, గాయకులు ప్రణయ్‌కుమార్, డా.పగిటిపాటి రాజు తదితరులు పాల్గొన్నారని చెప్పారు.

సాక్షి సినిమాలు



ఎస్‌వీసీ కాంప్లెక్స్: పఠాన్, వాల్తేరు వీరయ్య, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, శ్రీదేవి శోభన్‌బాబు
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: వీరసింహారెడ్డి, అమిగోస్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: వాల్తేరు వీరయ్య, సార్, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్: పఠాన్, యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, షెహ్జాదా, రైటర్ పద్మభూషణ్, అవతార్ ది వే ఆఫ్ వాటర్
భరత్ కాంప్లెక్స్: పఠాన్, మేఖేల్, షెహ్జాదా
రాజ్: వినరో భాగ్యము విష్ణు కథ
శ్రీరామ: యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా
విజయ: సార్

క్రీడా వికాసం

క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. గ్రామ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించడంతో పాటు వారిని వెలుగులోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సచివాలయాల పరిధిలో జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లను ఏర్పాటు చేస్తోంది. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) పర్యవేక్షణలో ఈ క్లబ్‌లను నిర్వహించనుంది.

- క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత
- ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లకు శ్రీకారం
- ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఏర్పాటు
- ప్రతినెలా గ్రామీణ, మండల స్థాయిల్లో టోర్నమెంట్ల నిర్వహణ
- మూడు నెలలకోసారి జిల్లా స్థాయిలో ఇంటర్ క్లబ్ పోటీలు



జిల్లా క్రీడాప్రాధికార సంస్థ



కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

కర్నూలు (టౌన్) : గత రెండేళ్లుగా జిల్లాలో ఎక్కడ చూసినా క్రీడా సంబరాలు జరుగుతున్నాయి. ఇప్పటికే జిల్లా స్థాయి స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీలు, ఏపీ సీఎం కప్ , జగనన్న క్రీడా పోటీలు జరుగుతున్నాయి. క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. గతంలో జిల్లా స్థాయిలో ఏదైనా క్రీడలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటే తప్పా ప్రోత్సాహం ఉండేది కాదు. ఇప్పుడు క్రీడలపై ఆసక్తి గల ప్రతి ఒక్కరినీ ప్రోత్సహిస్తున్నారు. దీంతో జిల్లా నుంచి పలువురు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు.

పక్కా ప్రణాళికతో ఏర్పాటు..

ఒక్కో క్రీడకు ఒక్కో క్లబ్ చొప్పున.. మొత్తం గ్రామంలో 26 క్రీడాంశాలపై జగనన్న క్రీడా క్లబ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, పాలకమండలి సభ్యులతో కార్యకలాపాలు సాగించేలా రూపకల్పన చేస్తున్నారు. మూడునెలలకు ఒకసారి మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో స్పోర్ట్స్ క్లబ్‌లు పోటీలు నిర్వహించేలా మార్గదర్శకాలు సిద్ధం చేశారు. ఇప్పటికే శాప్ అధికారులు స్పోర్ట్స్ క్లబ్‌ల రిజిస్ట్రేషన్‌ను ప్రత్యేక యాప్ ద్వారా చేపడుతోంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 800 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. కాగా గ్రామాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల్లో కూడా స్పోర్ట్స్ క్లబ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

పీఎస్‌ఏ, ఎంఎస్‌ఏ పర్యవేక్షణ..

గ్రామాల్లోని స్పోర్ట్స్ క్లబ్‌లను పంచాయతీ స్పోర్ట్స్ అథారిటీ (పీఎస్‌ఏ), మండల స్థాయిలో మండల స్పోర్ట్స్ అథారిటీ (ఎంఎస్‌ఏ) పర్యవేక్షించనున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో నిధులు సమకూర్చుకుంటూ ఈ క్లబ్‌లు క్రీడా కార్యకలాపాలు కొనసాగిస్తాయి. సర్పంచ్ చైర్మన్‌గా ఉండే పీఎస్‌ఏలో పంచాయతీ సెక్రటరీ, గ్రామానికి చెందిన జిల్లాస్థాయి క్రీడాకారుడు లేదా క్రీడాభివృద్ధికి ముందుకు వచ్చే దాత, స్థానిక హైస్కూల్ పీఈటీ సభ్యులుగా ఉంటారు. ఎంపీపీ చైర్మన్‌గా ఉండే ఎంఎస్‌ఏలో తహసీల్దార్, ఎంఈఓ, ఎస్‌ఐ, మండల ఇంజినీరు, ఎంపీడీఓ, ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్/హెచ్‌ఎం, మండలం నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించిన పురుష, మహిళా క్రీడాకారులు (ఒక్కొక్కరు), స్వచ్ఛంద సేవకులు సభ్యులుగా ఉంటారు.

తరచుగా టోర్నమెంట్ల నిర్వహణ

గ్రామాల్లో క్రీడా పోటీలు నిర్వహించి ప్రతిభ గల క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా జగనన్న క్రీడా క్లబ్‌లు పనిచేస్తాయి. ప్రతి నెల గ్రామీణ, మండల స్థాయిలో టోర్నమెంట్లు నిర్వహిస్తారు. అందులో ప్రతిభ గల వారికి జిల్లా స్థాయికి ఎంపిక చేస్తారు. అలాగే ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయిలో ఇంటర్‌క్లబ్ పోటీలు నిర్వహిస్తారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట



ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోంది. ఇటీవల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి జిల్లాలో క్రీడా పోటీలకు మంచి స్పందన వచ్చింది. గ్రామీణ, మండల స్థాయిల్లోనూ స్థానిక క్రీడలను పరిగణలోకి తీసుకొని పోటీలు నిర్వహించాం. 23 క్రీడాంశాల్లో 5 వేల మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. 1200 మంది అర్హత సాధించారు. జిల్లా స్థాయి,రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలోనూ జిల్లా నుంచి క్రీడాకారులు పాల్గొనడంతో పాటు పతకాలు సాధించారు. ఇది శుభపరిణామం. గతంలో ఎప్పుడూ లేని విధంగా క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. – ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మయ్య

ప్రతిభ వెలుగులోకి వస్తుంది



గత నెల 9, 10 తేదీల్లో కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించింది. నేను 71 కేజీల విభాగంలో పాల్గొన్నా. ఈ పోటీల్లో బంగారు పతకం సాధించా. చాలా సంతృప్తిగా ఉంది. కరోనా వల్ల క్రీడా పోటీల నిర్వహణలో జాప్యం జరిగింది. గత రెండేళ్లుగా క్రీడలు, పోటీలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల మన ప్రతిభ వెలుగులోకి వస్తుంది. జగనన్న స్పోర్ట్స్ క్లబ్‌లు అందుకు దోహదపడుతాయి. – పుష్పాంజలి వెయిట్ లిఫ్టర్

పరుగు వీరుడు నవీన్

క్రీడలు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో నిర్వహించిన పరుగు పందెంలో 14 మంది యువకులు పోటీ పడ్డారు. సమాధి నాగయ్య గుడి నుంచి వై.కానాపురం వరకు ఏర్పాటు చేసిన పరుగు పందెంలో నవీన్ మొదటి స్థానంలో నిలిచి రూ. 3,016 కైవసం చేసుకున్నాడు. రెండవ స్థానంలో దినకర్(రూ.2,016), మూడవ స్థానంలో దస్తగిరి(రూ.1,016), నాలుగవ స్థానంలో వీరంజి (రూ.516) నిలిచారు. అలాగే హైస్కూల్ మైదానంలో నిర్వహించిన స్లో బైక్ రైడింగ్‌లో సైలెంట్ కిల్లర్, మహేంద్ర, శ్రీను మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

సెపక్‌తక్రా విజేత కర్నూలు



విజేతగా నిలిచిన కర్నూలు జిల్లా జట్టు

ఉరవకొండ: రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో కర్నూలు జిల్లా జట్టు జయకేతనం ఎగురవేసింది. అనంతపురం జిల్లా ఉరవకొండలోని పోలీసు క్రీడామైదానం వేదికగా ఈ నెల 19న ప్రారంభమైన అండర్ 14, 17 బాలురు, బాలికల రాష్ట్ర స్థాయి సెపక్‌తక్రా పోటీలు సోమవారం ముగిశాయి. పది జిల్లాల జట్లు ప్రాతినిధ్యం వహించగా.. డే అండ్ నైట్ మ్యాచ్‌లు నిర్వహించారు. అండర్–14 బాలుర విభాగం ఫైనల్ మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. అండర్–14 బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై పశ్చిమ గోదావరి, అండర్–17 బాలుర విభాగంలో అనంతపురం జిల్లా జట్టుపై పశ్చిమ గోదావరి జిల్లా జట్టు, అండర్–17 బాలికల విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై అనంతపురం జిల్లా జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ట్రోఫీలను గుత్తి డిప్యూటీ డీఈఓ శంకరప్రసాద్, సీఐ హరినాథ్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యదర్శి మొరార్జీయాదవ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మారుతీప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత



అగ్నిప్రమాద బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఎమ్మెల్యే దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు.

బాధితులకు పరామర్శ...

బుధవారపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో గుడిసె కాలిపోయిన బాధితులను ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ పరామర్శించారు. ప్రభుత్వ పరంగా సహకారం అందేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

పాత నేరస్తుల బైండోవర్

పోలీసు డైరీ

కర్నూలు: స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జొహరాపురంలో నివాసముంటున్న ఐదుగురు పాత నేరస్తులను బైండోవర్ కేసు నమోదు చేశారు. నిందితులను సోమవారం కర్నూలు ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు ఎదుట పోలీసులు హాజరుపరిచారు. జొహరాపురానికి చెందిన చంద్రకంటి లక్ష్మమ్మ, ఇజ్రాయేల్, గద్దెపోగు శ్రీను, మల్లెపోగు నరేష్, అచ్చెమ్మ తదితరులపై గంజాయి కేసులు ఉన్నాయి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా వీరు మళ్లీ గంజాయి వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం అందడంతో అదుపులోకి తీసుకుని బైండోవర్ చేసినట్లు ఒకటో పట్టణ సీఐ తిమ్మారెడ్డి తెలిపారు.

'నారాయణ' లెక్చరర్ అదృశ్యం



అసదుల్లా బేగ్

కర్నూలు(సిటీ) : నారాయణ జూనియర్ కాలేజీలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ అసదుల్లా బేగ్ అదృశ్యమయ్యాడు. ఈ మేరకు ఆయన భార్య షమీన్ ఉబ్రా సోమవారం మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 17వ తేదీన గాయత్రి ఎస్టేట్‌లోని జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ విద్యార్థులకు క్లాస్ బోధిస్తుండగా ఇద్దరు విద్యార్థులు పట్టించుకోకుండా మాట్లాడుతుండటంతో వారిని హెచ్చరించారు. ఈ విషయంలో సదరు లెక్చరర్‌పై ఆ విద్యార్థులు తిరగబడి చేయి చేసుకున్నారు. దీనిపై కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కాలేజ్ నుంచి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి తన భర్త కనిపించడం లేదని కాలేజీ నిర్వాహకులకు అడిగినా సరైన సమాధానం చెప్పడం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో హల్‌చల్

కర్నూలు సిటీ: మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేసి ఇద్దరిని గాయపరిచాడు. సోమవారం రాత్రి రోజా వీధిలో ఈ సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. చందు అనే వ్యక్తి పూటుగా మద్యం తాగి రోజా వీధిలో స్థానికులపై హల్‌చల్ చేశారు. వారు ప్రతిఘటించగా రాళ్లు రువ్వాడు. ఈ ఘటనలో సలీమ్, అబ్దుల్లా అనే ఇద్దరు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 2వ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలి

సంక్షిప్తం

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆ జేఏసీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈనెల 26వ తేదీలోపు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్తామన్నారు.

అంగన్‌వాడీల సమస్యలపై వినతి

కర్నూలు(రాజ్‌విహార్) : అంగన్‌వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న వర్కర్లు, ఆయాల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప కోరారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఆర్‌జేడీని కలసిన వారిలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లలితమ్మ తదితరులు ఉన్నారు.

సీపీఎంలోనే కొనసాగుతున్నా

కర్నూలు(సెంట్రల్): తాను సీపీఎం పార్టీలోనే కొనసాగుతున్నానని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ తెలిపారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న ప్రచారం బూటకమని, 50 ఏళ్లుగా సీపీఎంలోనే ఉన్నానని చెప్పారు. అయితే, పార్టీలో తనకు కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని కేంద్ర కమిటీకి నివేదించాను తప్ప పార్టీని వీడలేదని ఆయన సోమవారం ఓ వీడియోను విడుదల చేశారు.

సిటీ బస్సులు నడపాలి

కర్నూలు(సెంట్రల్): నగరంలో సిటీ బస్సులు నడపాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎం.సుధాకర్ బాబు కోరారు. ఈమేరకు ఆయన సోమవారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, కలెక్టర్, ఆర్టీసీ రీజినల్ మేనజర్‌కు వినతిపత్రాలు పంపినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. సిటీ బస్సుల ఏర్పాటుతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థికంగా మేలు జరుగుతుందన్నారు.

బాధిత కుటుంబానికి బీమా సాయం



మృతుడి భార్యకు రూ.10వేలు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 19వ వార్డు గణేష్ నగర్‌కు చెందిన జహంగీర్ అనే యువకుడు గుండెపోటుతో మరణించడంతో ఆయన కుటుంబానికి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమా ద్వారా ఆదుకుంటోంది. సోమవారం బాధిత కుటుంబానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర సభ్యుడు బెల్లం మహేశ్వరరెడ్డి తక్షణ సహాయంగా రూ.10 వేలు అందచేశారు. వైఎస్ఆర్ బీమా కింద సాధారణ మరణానికి రూ.లక్ష పరిహారం లభిస్తుందని చెప్పారు. ప్రస్తుతం రూ.10 వేలు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో 47 వార్డు సచివాలయ సంక్షేమ కార్యదర్శి మద్దిలేటి, స్థానిక నాయకులు శ్రీనివాసులు, తరుపాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు స్థలమైతే పన్ను ఎలా వేస్తారు ?

కర్నూలు(టౌన్): 'నగరంలోని ఎర్రబురుజు సమీపంలో ఉన్న అర్బన్ బ్యాంక్ వద్ద ఇంటి నెంబర్ 67/53బీలో తాము 50 సంవత్సరాలుగా నివసిస్తున్నాం. ఆ ఇంటికి కరెంటు మీటర్ ఉంది. ఆస్తి పన్ను (అసెస్‌మెంట్ నెంబర్ 1016034061) ఉంది. రోడ్డు స్థలమైతే ఎలా పన్నులు వేస్తార'ని షేక్ ఇంతియాజ్ బాషా సోమవారం రాత్రి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజులుగా తనపై, తన కుటుంబంపై, స్థానిక ప్రజాప్రతినిధిపై నిరాధార ఆరోపణలు చేస్తూ తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నారని తెలిపారు. 50 సంవత్సరాలుగా నివసిస్తున్న తమ ఇంటిని రోడ్డు అని, మేము కబ్జా చేస్తున్నామని ఆరోపణలు చేయడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు.

రేపు ఆవాజ్ నగర కమిటీ మహాసభలు

కర్నూలు(సెంట్రల్): నగరంలోని జీబీ ఫంక్షన్ హాలులో ఈనెల 22వ తేదీన ఆవాజ్ నగర కమిటీ మహాసభలు నిర్వహిస్తున్నట్లుఆ సంఘం నగర కార్యదర్శి ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. సోమవారం నగర కమిటీ కార్యాలయంలో ఏ ర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇంతియా జ్, ఇలియాజ్, మహ్మద్ షరీఫ్ పాల్గొన్నారు.

ఏపీపీ బాలు నాయక్ మృతికి సంతాపం



బాలునాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

కర్నూలు(లీగల్): కర్నూలు మొదటి అదనపు జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.బాలునాయక్ (42) సోమవారం ఉదయం 9 గంటలకు గుండెపోటుతో మృతిచెందారు. పది సంవత్సరాల క్రితం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపికైన బాలునాయక్ ఆళ్లగడ్డ, తంబళపల్లె, అనంతపురం తదితర ప్రాంతాల్లో పని చేశారు. గతేడాది జులైలో బదిలీపై కర్నూలుకు వచ్చారు. ఏపీపీ బాలు నాయక్ మృతికి సంతాపంగా కర్నూలు జిల్లా న్యాయవాదుల సంఘం న్యాయవాదులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టు ప్రారంభ సమయంలో మెజిస్ట్రేట్ టి.జ్యోత్స్నదేవి కోర్టు హాలులో కొన్ని నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి కాటం రంగడు, మాజీ అధ్యక్షుడు ఓంకార్, సీనియర్లు పాపారావు, గోపాలకృష్ణుడు, జయన్న, రవికాంత్ ప్రసాద్, రమేష్, నరసింహులు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

● **నేడు ఆదోనిలో ఏపీ ఎన్‌జీఓ సమావేశం**

కర్నూలు(అగ్రికల్చర్):ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఈ నెల 21న ఆదోనిలో నిర్వహించనున్నారు. పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్‌లో ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని తాలూకాల అధ్యక్ష, కార్యదర్శులు ఈ సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

● **వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం**

కల్లూరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(బాలుర)లో స్టడీ అవర్‌ను పరిశీలించారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

● అధికారులకు ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, ఇతర అధికారులు

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్‌మీనా అధికారులకు ఆదేశించారు. ఎక్కడా పొరపాట్లకు తావు లేకుండా చూడాలన్నారు. సోమవారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లు, జేసీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తులను పరిశీలించి వెంటనే అర్హత ఉన్న వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. జాబితాలో డూప్లికేట్, అర్హత లేని వారికి ఓటు ఉంటే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ స్టేషన్‌లోని బ్యాలెట్ బాక్సుల భద్రతా, బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ తదితర అంశాలపై సమీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి ఫామ్–7, పట్టభద్ర నియోజకవర్గానికి సంబంధించి ఫామ్–8లను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించి 28వ తేదీలోపు ప్రతిపాదనలు పంపాలన్నారు. ఎన్నిలకు సంబంధించిన ఫిర్యాదులపై విచారణ జరిపి 24 గంటల్లో పరిష్కారాలు చూపాలన్నారు. ఎక్కడైనా పోలింగ్ స్టేషన్ మార్పు ఉంటే వెంటనే తెలియజేయాలన్నారు. జిల్లాలోని పరిస్థితులను డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు ఎన్నికల ప్రధాన అధికారికి వివరించారు. జిల్లాలో ఓటర్ల దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చర్యలు తీసుకున్నామని, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పా టు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీఓ నాగరాజు నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఈడీ శ్రీనివాసరావు, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

రంగనాథస్వామి విగ్రహ ప్రతిష్ఠకు అంకురార్పణ



పూజ కార్యక్రమంలో త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి, రుత్వికులు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని మామిదాలపాడు సమీపంలోని గోదా గోకులంలో శ్రీరంగనాయకి గోదా సమేత శ్రీరంగనాథ పెరుమాళ్, సుదర్శన, గరుడ, ఆల్వారాచార్యుల దేవతామూర్తుల ప్రతిష్ఠాపనకు సోమవారం అంకురార్పణ చేశారు. అష్టాక్షరీ సంపత్కుమార రామానుజ జీయర్ స్వామి మార్గదర్శనంలో ఈ కార్యక్రమం జరిగింది. సముద్రాల రమాకాంతాచార్యస్వామి పాంచరాత్రాగమానుసార సన్నాహక దీక్షతో అంకురార్పణ చేశారు. వేద పండితులు శ్రీమన్నారాయణాచార్యులు, మాధవాచార్యులు, భగవాన్ ఆచార్యులు, రమేష్ ఆచార్యులు, రంగనాథాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గోదాగోకులం వ్యవస్థాపకులు మారం నాగరాజు గుప్త, మేనేజింగ్ ట్రస్టీ నాగరాజు మాట్లాడుతూ 8వ రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి మార్చి 1వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరుపుతామన్నారు.

హరహర మహాదేవ!



ఉత్సవమూర్తుల పల్లకీని మోస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: హరహర మహాదేవ!.. శంభోశంకర!! నినాదాల మధ్య కాల్వ బుగ్గ రామేశ్వరుడి రథోత్సవం సోమవారం కడు రమణీయంగా సాగింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమ వారం సాయంత్రం భ్రమరాంబ, బుగ్గ రామేశ్వర స్వాముల రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రథానికి పూజలు చేసి, ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో ముస్తాబు చేశారు. అర్చకులు రథాంగపూజ, హోమం నిర్వహించారు. తర్వాత ఆదిదంపతులను పల్లకీలో కొలువుంచి భాజాభజంత్రీలతో రథశాల వద్దకు చేర్చారు. అమ్మవారి పల్లకీని ఎమ్మెల్యే భుజాలపై మోసుకెళ్లారు. అంతకుముందు నన్నూరు గ్రామంలో నిర్వహించిన భవానీ సమేత నాగేశ్వరస్వాములను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన రథానికి సర్పంచు బ్రహ్మయ్య, చెన్నారెడ్డితో కలిసి ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి ప్రత్యే క పూజలు చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా కాల్వబుగ్గ దేవస్థానంలో అప్పటికే సిద్ధం చేసిన రథంపైకి స్వామిఅమ్మవార్లను తీసుకెళ్లి ఆశీనులగావించారు. అనంతరం ఓం నమఃశివాయ, శంభోశంకర, హరహోం హర అంటూ భక్తులు రథాన్ని ముందుకు కదిలించారు. స్వాముల రథంపైకి పూలు విసురుతూ భక్తులు తన్మయత్వం పొందారు.